


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 13-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 218 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## నల్లమల సాగర్‌పై కోర్టుకు మా అభ్యంతరం చెప్పాం.. మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు




పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టు పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు లో విచారణ ముగిసింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాల మధ్య ఉండే ఇలాంటి జల వివాదాలను ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్‌గా కాకుండా, ఆర్టికల్ 131 కింద 'సివిల్ సూట్' ద్వారానే పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది.

సూట్ ఫామ్‌లో రమ్మని అని కోర్టు చెప్పింది..: ఈ క్రమంలో కోర్టు తీర్పుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఢిల్లీ లోని సుప్రీం కోర్టు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలను లేవనెత్తుతూ రిట్ పిటిషన్ వేశామని అన్నారు.

## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్స్.. సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్




ట్రాన్స్ జెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు చెప్పారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కో ఆప్షన్ మెంబర్ గా ఒక ట్రాన్స్ జెండర్ ని కార్పొరేటర్ గా నామినేట్ చేయాలని సూచించారు. తద్వారా వారి సమస్యలపై వారు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీనికి సంబంధించి వచ్చే కేబినెట్ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. వీరికి అవకాశం ఇవ్వడం ద్వారా వారి సమస్యలను మనం ప్రస్తావించడం కాకుండా వారి సమస్యలను వారే ప్రస్తావిస్తారని అలాగే ఈ సమాజంలో వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సోమవారం 'బాల భరోసా', 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రజాభవన్ లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక విషయాలు ప్రస్తావించారు. ట్రాన్స్ జెండర్స్ కు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో కోత: ప్రభుత్వ ఉద్యోగుల తల్లితండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతంలో 10-15 శాతం కోత విధిస్తామన్నారు. కోత విధించిన డబ్బును తల్లిదండ్రుల ఖాతాల్లో వేస్తామన్నారు.

## విజయవాడలో దారుణం.. అల్లుడి చేతిలో అత్త హతం




## భారీ అగ్ని ప్రమాదం.. ఒకరు మృతి, 9 మంది గల్లంతు




## బెంగళూరు టెకీ కేసులో సంచలనం.. లైంగిక దాడిని అడ్డుకున్నందుకు యువతి హత్య




## కరూర్ తొక్కిసలాట.. సీబీఐ విచారణకు హాజరైన నటుడు విజయ్




## హిందుత్వంపై కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు





కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ మరోసారి తన వ్యాఖ్యలతో రాజకీయ దుమారం రేపారు. కోల్‌కతాలో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ, "హిందుత్వం అనేది భయంతో కూడిన హిందూ మతం" అని ఆయన అభివర్ణించారు. "హిందుత్వానికి రక్షణ అవసరం" అనే అంశంపై 'కలకత్తా డిబేటింగ్ సర్కిల్' నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయ్యర్ మాట్లాడుతూ, "హిందుత్వం అనేది 80 శాతం ఉన్న హిందువులను, కేవలం 14 శాతం ఉన్న ముస్లింల ముందు వణికేలా చేస్తుంది. క్రిస్మస్ రోజున చర్చిలో భోజనానికి వెళ్లినందుకు ఒక అంధురాలైన గిరిజన బాలికను బీజేపీ నాయకుడు కొట్టడమే హిందుత్వం," అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హిందూ మతం ఎంతో గొప్ప ఆధ్యాత్మిక మతమని, దానికి 'హిందుత్వ' రక్షణ అవసరం లేదని, వేల సంవత్సరాలుగా హిందూ మతం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని ఆయన పేర్కొన్నారు. అలాగే, వీడి సావర్కర్ బౌద్ధ మతాన్ని హిందువులకు ప్రమాదకరంగా భావించారని కూడా అయ్యర్ ప్రస్తావించారు.

## భారత యువతకు జర్మనీ రెడ్ కార్పెట్ వీసా నిబంధనలు సరళం: ప్రధాని మోడీ




భారత ప్రధాని నరేంద్ర మోడీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశం లో ఇరు దేశాల మధ్య కుదిరిన కీలక ఒప్పందాలను వెల్లడించారు. ప్రధానంగా వలసలు , మొబిలిటీ, నైపుణ్యాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మోడీ తెలిపారు. భారతీయ యువత జర్మనీ ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నారని, ఈ బంధాన్ని మరింత బలపరుస్తూ 'గ్లోబల్ స్కిల్స్ పార్టనర్‌షిప్'పై ఇరువురు నేతలు ఉమ్మడి ప్రకటన చేశారు.

## బీఎండబ్ల్యూ కారు బీభత్సం.. బైక్, ట్రాక్టర్‌ను ఢీకొట్టి...!




## పీఎస్ఎల్వీ ప్రయోగం ఎందుకు విఫలమైంది.. అంతరిక్షంలో ఏం జరిగింది?




## ఏపీ ప్రయాణికులకు.. మరికొన్ని ప్రత్యేక రైళ్లు




# పోలవరం-నల్లమల సాగర్ లింక్‌పై సుప్రీం స్పష్టత




- ☼ఆర్టికల్ 32 కాదు... 131 కిందే జల వివాదాల పరిష్కారం
- ☼తెలంగాణ రిట్ పిటిషన్ ఉపసంహరణ
- ☼సివిల్ సూట్‌గా మళ్లీ కోర్టును ఆశ్రయించనున్న రాష్ట్రం
- ☼మహారాష్ట్ర-కర్ణాటకల ప్రమేయం కీలకం
- ☼ఏపీ డీపీఆర్ పనులపై తెలంగాణ అభ్యంతరాలు
- ☼కేంద్ర అనుమతులు లేకుండా ప్రాజెక్టు విస్తరణ?
- ☼మధ్యవర్తిత్వం లేదా కమిటీ ద్వారా పరిష్కార సూచన

మిగతా 2 లో

పోలవరం - నల్లమల సాగర్ ఇష్యూపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. లింక్ ప్రాజెక్టును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం.. విచారణకు అభ్యంతరం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్ కు విచారణ అర్హత లేదని జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.రాష్ట్రాల మధ్య ఉండే జల వివాదాలను ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ గా కాకుండా ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ ద్వారానే పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు వినాల్సి ఉందని తెలిపింది.

## తెలంగాణ ప్రాజెక్టులపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు




పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు అర్హత లేదని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీంతో తెలంగాణ అభ్యంతరంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. నల్లమల సాగర్‌తో ఏ రాష్ట్రానికీ నష్టముండదన్నారు.

## వందే భారత్ స్లీపర్ రైలులో నో వీఐపీ కోటా.. టికెట్ కన్ఫామ్ అయిన వారికే ప్రయాణానికి అనుమతి




దేశంలో తొలి వందేభారత్ స్లీపర్ రైలు త్వరలో పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఈ నెల చివరికల్లా ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. గువాహటి-కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.పధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం


## రాష్ట్రంలో మరో కీలక నిర్ణయం.. జూనియర్ ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

రాష్ట్రంలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్ లను ఇప్పటికే పలుమార్లు ట్రాన్స్ ఫర్ చేసింది. ఇప్పుడు జూనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. మార్కాపురం జాయింట్ కలెక్టర్‌గా పి.శ్రీనివాసులు, వైద్యారోగ్యశాఖ జాయింట్ సెక్రటరీగా గోపాలకృష్ణ, సివిల్ సప్లయి డైరెక్టర్‌గా శ్రీవాస్ నుపుర్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పన కుమారి, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా మయూర్ అశోక్, తిరుపతి అర్బన్ డైవలప్ మెంట్ అధారిటీ చైర్మన్‌గా ఆర్ గోవిందరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నల్లమల సాగర్‌పై కోర్టుకు మా అభ్యంతరం చెప్పాం.. మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



ఇదే కేసులో గత సోమవారం కూడా విచారణ జరిగిందని, నాడు ఇచ్చిన వాదనలను అదనంగా సోమవారం మరికొన్ని వాదనలు కోర్టులో వినిపించామని తెలిపారు. ఇక్కడ కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశమని అన్నారు. ఏపీ సర్కార్ అనేక ఉల్లంఘనలు చేసిందని పేర్కొన్నారు. అన్నింటినీ సుప్రీం కోర్టుకు దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను కూడా అమలు చేయడం లేదనే విషయాన్ని కూడా చెప్పామన్నారు.పోలవరం

ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదు..: ఏపీకి కేటాయించిన 484.5 టీఎంసీలు.. ఎక్కువగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ముందుకెళ్తోందనే విషయాన్ని ధర్మాసనం ఎదుట వివరించామని తెలిపారు. ముందుగా డిజైన్ చేసిన దాని కంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని చెప్పామన్నారు. రిట్ పిటిషన్ కాకుండా సూట్ ఫామ్‌లో రావాలని కోర్టు స్పష్టం చేసిందని అన్నారు. ఈ మేరకు పోలవరం– నల్లమల సాగర్ ప్రాజెక్టుపై రెండు రోజుల్లో సివిల్ సూట్ దాఖలు చేస్తామని.. తెలంగాణ నీటి హక్కులను కాపాడటం కోసం ఎందాకైనా పోరాడుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కామెంట్ చేశారు.

## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్స్.. సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్

ట్రాన్స్ జెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు చెప్పారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కో ఆప్షన్ మెంబర్ గా ఒక ట్రాన్స్ జెండర్ ని కార్పొరేటర్ గా నామినేట్ చేయాలని సూచించారు. తద్వారా వారి సమస్యలపై వారు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీనికి సంబంధించి వచ్చే కేబినెట్ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. వీరికి అవకాశం ఇవ్వడం ద్వారా వారి సమస్యలను మనం ప్రస్తావించడం కాకుండా వారి సమస్యలను వారే ప్రస్తావిస్తారని అలాగే ఈ సమాజంలో వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సోమవారం 'బాల భరోసా', 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రజాభవన్ లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక విషయాలు ప్రస్తావించారు. ట్రాన్స్ జెండర్స్ కు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో కోత: ప్రభుత్వ ఉద్యోగుల తల్లితండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతంలో 10–15 శాతం కోత విధిస్తామన్నారు. కోత విధించిన డబ్బును తల్లిదండ్రుల ఖాతాల్లో వేస్తామన్నారు.ఈ విషయంలో ఈ బడ్జెట్ సమావేశాల్లోనే చట్టం చేస్తామన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేస్తే వారి జీతాల్లో కోత విధిస్తామన్నారు. తల్లిందండ్రులను నిర్లక్ష్యం చేసే వారిని మనమే దారిలోకి తీసుకురావాల్సిన అవసరం ఈప్రభుత్వానికి ఉందన్నారు. తల్లిదండ్రులపై బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిఒక్కరికీ వైద్యం అందించాలనే ప్రణాళికలను ఈ ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోరుకుంటోందని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే మా ఉద్దేశం అని వర్గీకరణ కారణంగా కొందరిలో అసంతృప్తి ఉన్నా త్వరలో సర్దుకుంటాయన్నారు. వందేళ్ల తర్వాత తొలిసారి జనగణనతో పాటు కులగణన చేశామన్నారు. జనాభా దమాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని చూస్తోందన్నారు. ఈ ఏడాదిలో కేంద్రం చేస్తున్న జనగణన తెలంగాణ జనగణన మోడల్ ను కాపీ కొట్టిందన్నారు. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. రెండేళ్ల మా పాలనలో అన్ని సమస్యలు పరిష్కరించామని, అద్భుతాలు చేశామని నేను చెప్పడం లేదు. కానీ ఉన్న సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోందన్నారు. ఒకప్పుడు ఈ ప్రజాభవన్ లోకి అడుగు పెట్టేందుకు నాలుగు గంటలు ఎదురు చూసినా గద్దర్ రాలేకపోయారు. కొద్ది మంది శ్రీమంతులు, బడా వ్యక్తులకే ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు సామాన్యులు కూడా ఇక్కడకు రావొచ్చు. ధర్మగంట కొట్టవచ్చు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోరుకుంటోందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే మా ఉద్దేశం అన్నారు. ప్రజా సమస్యలను. ఇంకా చేయాల్సింది చాలా ఉందని ఈ ప్రజాప్రభుత్వానికి అండగా ఉండాలని తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చేస్తామన్నారు.

## హిందుత్వంపై కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ మరోసారి తన వ్యాఖ్యలతో రాజకీయ దుమారం రేపారు. కోల్‌కతాలో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ, "హిందుత్వం అనేది భయంతో కూడిన హిందూ మతం" అని ఆయన అభివర్ణించారు. "హిందుత్వానికి రక్షణ అవసరం" అనే అంశంపై 'కలకత్తా డిబేటింగ్ సర్కిల్' నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అయ్యర్ మాట్లాడుతూ, "హిందుత్వం అనేది 80 శాతం ఉన్న హిందువులను, కేవలం 14 శాతం ఉన్న ముస్లింల ముందు వణికేలా చేస్తుంది. క్రిస్మస్ రోజున చర్చిలో భోజనానికి వెళ్లినందుకు ఒక అంధురాలైన గిరిజన బాలికను బీజేపీ నాయకుడు కొట్టడమే హిందుత్వం," అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హిందూ మతం ఎంతో గొప్ప ఆధ్యాత్మిక మతమని, దానికి 'హిందుత్వ' రక్షణ అవసరం లేదని, వేల సంవత్సరాలుగా హిందూ మతం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని ఆయన పేర్కొన్నారు. అలాగే, వీడి సావర్కర్ బౌద్ధ మతాన్ని హిందువులకు ప్రమాదకరంగా భావించారని కూడా అయ్యర్ ప్రస్తావించారు.ఈ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ పార్టీ హిందువుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. అదే కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది స్పందిస్తూ, "హిందూ తత్వమే హిందుత్వం. ప్రపంచంలో కేవలం హిందూ మతం మాత్రమే తన మత గ్రంథాలపై కూడా చర్చించే స్వేచ్ఛను ఇస్తుంది," అని అయ్యర్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. అయ్యర్ వ్యాఖ్యలు సనాతన ధర్మాన్ని అవమానించేలా ఉన్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. అలాగే పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా స్పందిస్తూ.. మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

పోలవరం–నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు అర్హత లేదని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీంతో తెలంగాణ అభ్యంతరంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. నల్లమల సాగర్‌తో ఏ రాష్ట్రానికీ నష్టముండదన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, ఆ సమయంలో తాము అడ్డుచెప్పలేదని గుర్తు చేశారు. గోదావరి, కృష్ణా నదుల నీటిని తెలంగాణ వాడుకున్న తర్వాతే తమ రాష్ట్రం వాడుకుంటుందని తెలిపారు. పోలంవరం ప్రాజెక్టు పనులు ఇప్పటి వరకు 87 శాతం పూర్తి అయ్యాయన్నారు. సముద్రంలో కలిసే కొంత నీటిని వాడుకుంటామని చెబుతున్నామని, పోలవరం పూర్తి అయితే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చంద్రబాబు తెలిపారు.

## పోలవరం-నల్లమల సాగర్ లింక్‌పై సుప్రీం స్పష్టత

మొదటి పేజీ తరువాయి

దీంతో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను ఉప సంహరించుకుంది. దీనిపై సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలిపింది. కోర్టు సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే కర్ణాటక, మహారాష్ట్రలను కూడా ప్రతివాదులుగా చేర్చుతూ ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసే అవకాశం ఉంది. అదేవిధంగా, ఈ వివాదాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ముందు లేదా మధ్యవర్తిత్వం (వీవసఙ్ఞఅశీఅ) ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

మహారాష్ట్ర, కర్ణాటకల ప్రమేయం

తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ హాజరై వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం అనుమతులు లేకుండానే డీపీఆర్ పనులు చేపడుతోందని, ఇది తెలంగాణ జల ప్రయోజనాలకు విఘాతమని వాదించారు. అయితే, కోర్టు సూచనల మేరకు సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ఆయన కోర్టుకు తెలిపారు. ఈ వివాదం కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. గోదావరి జలాల పంపిణీలో కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు కూడా సంబంధం ఉన్నందున, వారిని కూడా ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

రిట్ పిటిషన్ లో పేర్కొన్న అంశాలివి..

పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందని రిట్ పిటిషన్ లో పేర్కొంది. ఈ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ఏపీకి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే పనులను ఆపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథరిటీకి ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. పోలవరం ప్రాజెక్టు స్వరూపం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే ఉండాలి గాని.. విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమేనని పిటిషన్లో తెలిపింది. కేంద్రం కూడా తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును పరిశీలనకు తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదంది. ప్రాజెక్టుపై నెక్స్ట్ స్టెప్ తీసుకోకుండా జలశక్తి మంత్రిత్వశాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. తాము కేవలం వరద జలాలనే వాడుకుంటున్నట్లు ఏపీ బదులిచ్చింది.

## విజయవాడలో దారుణం.. అల్లుడి చేతిలో అత్త హతం

విజయవాడలోని అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన జరిగింది. తన భార్యను అత్త కాపురానికి పంపకపోవడంతో.. కోపంతో ఊగిపోయిన అల్లుడు ఆమెపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరగ్గా.. స్థానికంగా తీవ్రకలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన కొమ్మూరు నాగసాయి, దుర్గాభవానీలు భార్యభర్తలు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతుండటంతో భవానీ సింగ్ నగర్లో ఉంటోన్న తన తల్లి కోలా దుర్గ (46) వద్దకు వెళ్లింది. కోపం తగ్గాక భార్య కాపురానికి వస్తుందని ఎదురుచూసిన నాగసాయి.. ఆమె ఎంతకూ రాకపోవడంతో.. తన అత్తే కాపురానికి రానివ్వడం లేదని కోపం పెంచుకున్నాడు.ఈ క్రమంలో నాగసాయి ఆదివారం సింగ్ నగర్ కు వెళ్లి తన భార్యను కాపురానికి పంపాలని కోరాడు. దీంతో అత్త – అల్లుళ్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. కోపం పట్టలేకపోయిన అతను.. వెంట తీసుకొచ్చిన కత్తితో దుర్గపై దాడిచేశాడు. ఈ దాడిలో ఆమెకు తీవ్రగాయాలు కాగా.. స్థానికులు ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ పిలిపించగా.. లోపలికి ఎక్కిస్తుండగానే మృతి చెందింది. దీంతో వెంటనే కిందకు దించేశాడు. కూతురు ఫిర్యాదుతో పోలీసులు నాగసాయిపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. అతనిపై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కూతురితో పాటు ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. గతంలో కూడా భవానీ నాగసాయిపై వేధింపుల కేసు పెట్టినట్లు తెలుస్తోంది.

## భారీ అగ్ని ప్రమాదం.. ఒకరు మృతి, 9 మంది గల్లంతు

సోమవారం తెల్లవారుజాము ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఒకరు మృతి చెందగా 9 మంది గల్లంతయ్యారు. ఈ షాకింగ్ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో అర్కి ప్రాంతంలోని పాత బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. తెల్లవారుజామున 2:00 – 2:30 గంటల సమయంలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నేపాల్‌కు చెందిన ఒక చిన్నారి మృతి చెందగా, మరో తొమ్మిది మంది వలస కూలీలు (నాలుగురు పెద్దలు, ఐదుగురు పిల్లలు) మంటల్లో చిక్కుకుపోయి గల్లంతయ్యారు. ఈ మంటల ధాటికి అక్కడ ఉన్న దాదాపు 10 నుండి 15 దుకాణాలు, ముఖ్యంగా చెక్కతో నిర్మించిన భవనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే అధికారులు ఎస్‌డిఆర్ఎఫ్, హోమ్ గార్డ్స్, అగ్నిమాపక సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. స్థానికంగా ఫైర్ ఇంజన్ సౌకర్యం లేకపోవడంతో సిమ్లా, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నుండి ఫైర్ టెండర్లను రప్పించి మంటలను అదుపు చేశారు. గల్లంతైన వారిలో రెండు జంటలు ఉన్నాయని, భవనాలు కుప్పకూలడం, మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు బ్రతికి ఉండే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని స్థానిక ఫైర్ ఆఫీసర్ ఆర్.కె. శర్మ తెలిపారు. గ్యాస్ సిలిండర్ పేలుడు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధితుల బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## భారత యువతకు జర్మనీ రెడ్ కార్పెట్ వీసా నిబంధనలు సరళం: ప్రధాని మోడీ



భారత ప్రధాని నరేంద్ర మోడీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశం లో ఇరు దేశాల మధ్య కుదిరిన కీలక ఒప్పందాలను వెల్లడించారు. ప్రధానంగా వలసలు , మొబిలిటీ, నైపుణ్యాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మోడీ తెలిపారు. భారతీయ యువత జర్మనీ ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నారని, ఈ బంధాన్ని మరింత బలపరుస్తూ 'గ్లోబల్ స్కిల్స్ పార్టనర్‌షిప్'పై ఇరువురు నేతలు ఉమ్మడి ప్రకటన చేశారు. ఈ ఒప్పందం వల్ల ముఖ్యంగా వైద్య రంగంలోని నిపుణులు ఉద్యోగ రీత్యా జర్మనీకి వెళ్లేందుకు మార్గం మరింత సులభతరం కానుంది.అలాగే, ఉన్నత విద్య, క్రీడల రంగంలోనూ సహకారాన్ని విస్తరించడానికి ఇరు దేశాలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా జర్మన్ యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లను భారత్‌లో ఏర్పాటు చేయాలని మోడీ ఆహ్వానించారు. భారతీయ పౌరుల కోసం జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ప్రకటించిన 'వీసా-ఫీ ట్రాన్సిట్ ఫెసిలిటీ' పట్ల మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని ఈ సందర్భంగా భారత ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

## వందే భారత్ స్లీపర్ రైలులో నో వీఐపీ కోటా.. టికెట్ కన్ఫామ్ అయిన వారికే ప్రయాణానికి అనుమతి

మొదటి పేజీ తరువాయి

భారతదేశపు మొట్టమొదటి ఈ వందే భారత్ స్లీపర్ రైలు కేవలం సామాన్య ప్రజల కోసమే అందుబాటులో ఉంటుందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందులో వీఐపీ కోటా ఉండదట. అంతేకాదు, ఎలాంటి ట్రావెల్ పాస్‌లను అనుమతించరు. అత్యవసర కోటాలకు కూడా అనుమతి ఉండదు. మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ అధికారులు కూడా సాధారణ ప్రయాణికుల్లానే ఇందులో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ రైలులో ప్రయాణికులకు కేవలం కన్ఫామ్ అయిన టికెట్లను మాత్రమే జారీ చేస్తారు. దీని వల్ల వెయిటింగ్ లిస్ట్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.

## బెంగళూరు టెకీ కేసులో సంచలనం.. లైంగిక దాడిని అడ్డుకున్నందుకు యువతి హత్య

బెంగళూరులో ఇటీవల జరిగిన యువతి మృతి ఘటన కీలక మలుపు తిరిగింది. ఆమెది ప్రమాదవశాత్తు జరిగిన మరణమో, ఆత్మహత్యో కాదని, హత్య అని తేలింది. హత్య చేసింది ఎదురింట్లో ఉండే 18 ఏళ్ల కర్నాల్ కురాయ్ అనే యువకుడిగా పోలీసులు తేల్చారు. బెంగళూరులోని రామమూర్తి పరిధిలోని సుబ్రమణి లే ఔట్ లోని అపార్ట్ మెంట్లో డీకే షర్మిల అనే 34 ఏళ్ల యువతి సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తూ ఉండేది. ఈ నెల 3న ఆమె తన ఫ్లాట్లో మరణించింది.

అక్కడి పరిస్తితులు చూస్తే.. ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిందని, ఊపిరాడక మరణించిందని పోలీసులు ప్రాథమికంగా భావించారు. అయితే, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అక్కడి ఫోరెన్సిక్ నివేదిక, సైంటిఫిక్ ఆధారాల వల్ల అది సహజ మరణం కాదని, హత్య అని తేలింది. దీంతో అనుమానాస్పద వ్యక్తుల్ని విచారించగా.. షర్మిల ఇంటి ఎదురింట్లోనే ఉండే కర్నాల్ కురాయ్ అనే యువకుడు హత్య చేసినట్లుగా అంగీకరించాడు. అయితే, హత్య చేసిన తీరు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 3న షర్మిల ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇది గుర్తించిన కర్నాల్ రాత్రి 9 గంటల సమయంలో ఆమె ఇంట్లోకి కిటికీ ద్వారా చొరబడ్డాడు. తనతో సెక్స్ కు ఒప్పుకోవాల్సిందిగా బలవంతం చేశాడు. దీనికి ఆమె ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఆమెను ఆమెపై దాడి చేసి, ఊపిరాడకుండా చేశాడు. నోరు, ముక్కు మూసి స్పృహ కోల్పోయేలా చేశాడు.

అనంతరం గొంతు కోయడంతో రక్తస్రావం కూడా జరిగి, ప్రాణాలు కోల్పోయింది. తను షర్మిలను హత్య చేసిన విషయం ఎక్కడ బయటపడుతుందో అని ఆధారాలు చెరిపేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు నమ్మించేలా మంటలు అంటించాడు. ఆమె దుస్తులు, ఇతర వస్తువులు ఇంట్లో కాలిపోయేలా చేశాడు. తర్వాత ఆమె ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. ఇంట్లో మంటలు గమనించి చుట్టుపక్కల వాళు వచ్చి, మంటలు ఆర్పి చూసేసరికి షర్మిల ప్రాణాలు కోల్పోయి కనిపించింది. దీంతో ఆమె అగ్ని ప్రమాదం వల్లే మరణించి ఉండొచ్చని ముందు అందరూ భావించారు. కానీ, చివరకు పోలీసులు సైంటిఫిక్ ఎవిడెన్స్ ఆధారంగా విచారణ జరిపి, హత్య అని తెలిసి, నిందితుడిని పట్టుకున్నారు.

## కరూర్ తొక్కిసలాట.. సీబీఐ విచారణకు హాజరైన నటుడు విజయ్

తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ సీబీఐ విచారణకు హాజరయ్యారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో కీలక నిందితుడుగా ఉన్న విజయ్‌కి సీబీఐ గతవారం సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. అధికారులు విజయ్‌ని విచారిస్తున్నారు.కాగా గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్ పట్టణంలో విజయ్ ప్రచార ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 110 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ క్రమంలో గత వారం విజయ్‌కి సీబీఐ అధికారులు సమన్లు పంపారు. ఈనెల 12వ తేదీన విచారణకు హాజరవ్వాలని అందులో ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం చెన్నై నుంచి ఢిల్లీకి చేరుకున్న విజయ్.. అక్కడ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

## పీఎస్ఎల్వీ ప్రయోగం ఎందుకు విఫలమైంది.. అంతరిక్షంలో ఏం జరిగింది?

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 స్పేస్ క్యాలెండర్‌లో తొలి ప్రయోగం విఫలమైంది. సోమవారం చేపట్టిన పీఎస్ఎల్వీ –సి62 రాకెట్‌లో "EOS-N1" ఉపగ్రహంతో పాటు స్వదేశీ, విదేశాలకు చెందిన 15 ఇతర ఉపగ్రహాలను ప్రయోగించింది. అయితే, ప్రయోగించిన కొద్దిసేపటికే రాకెట్‌కు నిర్దేశించిన మార్గం నుంచి పక్కకు వెళ్లింది. మూడో దశలో ఆటంకం ఏర్పడినట్లు ఇస్రో చైర్మన్ వి నారాయణన్ ప్రకటించారు. ప్రారంభంలో రాకెట్ అనుకున్న విధంగా ప్రయాణించినప్పటికీ, "చాంబర్ ప్రెజర్ ఊహించని విధంగా తగ్గడం మూడో దశ అవసరమైన థ్రస్ట్‌ను అందించడంలో విఫలమైంది. రాకెట్ నిర్దేశిత మార్గం నుంచి పక్కకు వెళ్లింది. దీంతో శాటిలైట్లను కక్ష్యలో ఉంచలేకపోయాము" అని చెప్పారు.

ప్రధాన శాటిలైట్ అయిన డీఆర్డీవోకు చెందిన వ్యూహాత్మక నిఘా శాటిలైట్ అన్వేషాతో పాటు మరో 15 శాటిలైట్స్ అంతరిక్షంలో గల్లంతయ్యాయి. పీఎస్ఎల్వీ మూడో దశలో విఫలం కావడం ఇది వరసగా రెండోసారి. మొదటి రెండు దశలు బాగానే ఉన్నా, మూడో దశలో రాకెట్ గతి తప్పింది. రాకెట్ ఊహించని విధంగా నిర్దేశిత మార్గం నుంచి పక్కకు జరగడం ప్రారంభించింది. సమతుల్యత కోల్పోయి బొంగరంలా తన చుట్టూ తాను తిరగడం ప్రారంభించింది. అంతరిక్షంలో గంటకు 8000 కిలోమీటర్ల వేగంతో చిన్నపాటి కదుపు కూడా మిషన్ పూర్తిగా నాశనం అయ్యేలా చేస్తుంది. ప్రాథమిక డేటా ప్రకారం, చాంబర్ ప్రెజర్ తగ్గినట్లు తెలుస్తోంది. సరిగ్గా ఇలాగే మే 2025లో పీఎస్ఎల్వీ –సి61 మిషన్ విఫలమైంది. తగినంత పీడనం లేకపోవడంతో, కక్ష్యలోకి చేరుకునే వేగాన్ని రాకెట్ అందుకోలేకపోయింది.

## బీఎండబ్ల్యూ కారు బీభత్సం.. బైక్, ట్రాక్టర్‌ను ఢీకొట్టి...!

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం లక్ష్మీపురం లో పెను ప్రమాదం తప్పింది. అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బీఎమ్?డబ్ల్యూ కారు బీభత్సంతో జరిగింది. రోడ్డుపై వేగంగా వెళ్తున్న సమయంలో కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో ఎదురుగా ఉన్న డ్రమ్ములు, బైక్‌ను ఢీ కొట్టింది. అయినా స్పీడ్ కంట్రోల్ కాలేదు. పుల్లల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. అయితే కారులో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు.. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

## ఏపీ ప్రయాణికులకు.. మరికొన్ని ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండుగ వేళ బస్సులు, రైళ్లు ఫుల్ అవుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. ఏపీలో మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించింది. రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా విజయవాడ–విశాఖ మధ్య 12 జన్ సాధారణ్ రైళ్లు ను నడుపుతున్నట్లు పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. జనవరి 18 వరకు ఈ రైళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. విశాఖలో ఉదయం 10 గంటల జన్ సాధారణ్ 08568 ఎక్స్ ప్రెస్ రైలు కదిలిందని, కాసేపట్లో విజయవాడకు చేరుకోనుందన్నారు. అలాగే 08568 విజయవాడ– విశాఖ ప్రత్యేక రైలు సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 12.35కు విజయవాడ చేరుకుంటుందని చెప్పారు. ఈ మేరకు ప్రయాణికులు ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛమైన గ్రామమే శక్తివంతమైన తెలంగాణ

**- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



ఇది కద నిజం: ఆలేరు మండలం మదనపల్లి గ్రామంలో గ్రామస్థులు స్వచ్ఛందంగా నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య చిపురు పట్టి గ్రామ వీధులను ఊడ్చి, స్వచ్ఛత ప్రాముఖ్యతపై గ్రామస్థులకు సందేశం ఇచ్చారు.గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వం చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానంద ఆశయాలతో యువత ముందుకు సాగాలి

**- భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి**




ఇది కద నిజం: సోమవారం భువనగిరి టౌన్ లోని వివేకానంద విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు , జిల్లా గ్రంథలయ ఛైర్మన్ ఆవేస్ చిస్తి హాజరయ్యారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత దేశంలో రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశారు, అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984 లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని "జాతీయ యువజన దినోత్సవం"గా ప్రకటించింది. వివేకానందుడు చిన్నప్పటి నుంచే రోజూ ధ్యానం చేసేవాడని, బాలుడిగా ఉన్నపుడు నరేంద్రుడు చాలా ఉల్లాసంగా, చిలిపిగా ఉండేవాడు. యువకులు అందరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతురావు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆటలలోనూ, చదువులో ముందుండేవాడని,పాఠాన్ని ఒకసారి చదివితే మొత్తం గుర్తుంచుకునేవాడు అతని జ్ఞాపకశక్తి అమోఘమైనదని యువతకు స్వామి వివేకానంద ఏన్నో ప్రభోదలు చేసి ఆ ప్రబోధాలు యువతను అలవర్చుకోవాలన్నారు. జిల్లా యువజన మరియు క్రీడాల అదికారి ధనంజనేయులు మాట్లాడుతూ స్వామి వివేకానంద గొప్ప తత్వవేత్తలలో ఒకరైన స్వామి వివేకానంద జీవితం, బోధనలను గౌరవించడానికి భారత దేశం ఈ రోజు జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటుంది. అత్యున్నత లక్ష్యానికి జీవితానాంత ధారపోయామని సందేశాన్నిచ్చిన్న సంస్కరణవాది, దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన విశ్వమానవుడు వివేకానందుని మార్గం అందరికీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు ,మున్సిపల్ కమిషనర్ రామలింగం , జిల్లా యువజన మరియు క్రీడల అదికారి ధనంజనేయులు, ఎస్.సి కార్పొరేషన్ ఈ.డీ శ్యామ్ సుందర్ , జిల్లా యువజన సంఘం నాయకుడు కరుణ్ , జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువతీ యువకులు క్రీడా సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామోహన్ రెడ్డి**



ఇది కద నిజం: పరిగి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి కమిటీ సమావేశంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలు, సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రూ.27 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వ్యవసాయ యంత్రాల పంపిణీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**



ఇది కద నిజం: ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మరియు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాయితీపై అందజేస్తున్న యంత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తోందని అన్నారు. ఆధునిక యంత్రాల వినియోగంతో వ్యవసాయ ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామికి 108 కలశాలతో ఘనాభిషేకం



ఇది కద నిజం:నారసింహుని జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు108 కలశాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి కలశాలలోని జలాలకు ప్రత్యేక పూజలు చేశారు.108 కలశాలలోని జలాలతో పాటు పంచామృతం తో మెళితమైన సుగంధ ద్రవ్యలతో పంచసూక్త పఠనాలు, వేదమంత్రలు,మంగళ వాయిద్యాల నడుమ నరసింహునికి అష్టోత్తర శత ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు.అలాగే స్వాతి నక్షత్రం సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ చేశారు భక్తులు,స్థానికులు,ఆలయ అధికారులు.ఆలయ కొండ చుట్టూ అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.కోలాటాలు,భక్తి గీతాలాపనాలు,భజనలు,లక్ష్మీ నరసింహుడి నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణ చేశారు.గిరి ప్రదక్షిణ చేసి లక్ష్మీ నర్సింహుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# మాదిరెడ్డిపల్లిలో ఘనంగా

## స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు



ఇది కద నిజం, నవాబుపేట్: వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లి గ్రామంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కిష్టయ్య పాల్గొని, కాషాయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. భారతదేశం యొక్క గొప్పతనాన్ని, హిందూ ధర్మ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహానుభావుడు స్వామి వివేకానంద అని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవాబుపేట మండలం బీజేవైఎం అధ్యక్షులు దగ్గుల శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ, వివేకానందుడి సిద్ధాంతాలు నేటి యువతకు దిక్సూచి వంటివని పేర్కొన్నారు. "ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన వందమంది యువకులు నాతో వస్తే ఈ దేశం రూపురేఖలను మారుస్తాను" అని వివేకానంద ఇచ్చిన పిలుపును ఆయన గుర్తు చేశారు. యువత తమలో ఉన్న అపరిమితమైన శక్తిని గుర్తించాలని, బలమే జీవితం.. బలహీనతే మరణం అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ధైర్యం, నిజాయితీలతో పోరాడి లక్ష్యాలను సాధించాలని ఆయన యువతకు హితబోధ చేశారు. ప్రతి భారతీయుడు తన మాతృభూమి రక్షణ కోసం, దేశ సేవ కోసం అంకితం కావాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, వార్డు మెంబర్ రామకృష్ణ, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ మల్లేశం గౌడ్, గ్రామ కార్యదర్శి అశోక్, తిరుపతి గౌడ్, శివ సాయికుమార్, రాఘవేందర్ గౌడ్, గణశ్యం గౌడ్, దేవేందర్ రెడ్డి, శ్రీకాంత్, గణేష్‌తో పాటు గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పులిమామిడిలో ఘనంగా

## స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు



ఇది కద నిజం, పులుమామిడి: నవాబుపేట్ పరిధిలోని పులిమామిడి గ్రామంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని విక్టరీ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి. నరసింహులు, ఉపసర్పంచ్ బి. నాగిరెడ్డి పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ సంస్కృతిని, యువత శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. వివేకానందుడి బోధనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను సాధించే క్రమంలో అలుపెరగని పోరాటం చేయాలని, సామాజిక సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. గ్రామంలో యువత ఐకమత్యంగా ఉండి అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో రామకృష్ణారెడ్డి, కళ్యాణ్ రావు, మాజీ ఉపసర్పంచ్ యు. సుధాకర్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు మరియు విక్టరీ బాయ్స్ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింధు మహిళా కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఇది కద నిజం, హైదరాబాద్: మైదిపట్నంలోని సింధు మహిళా కళాశాలలో ఈరోజు సంక్రాంతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగవల్లులు, గాలిపటాల ప్రదర్శనలు, క్విజ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ పండుగ ఉత్సాహాన్ని చాటారు. సంప్రదాయ వాతావరణంలో సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు ఐ. రామారావు, కళాశాల అధ్యక్షులు జే. వెంకటాచలపతి పాల్గొని విద్యార్థినులను అభినందించారు. అలాగే సింధు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎన్. సంధ్యారాణి, సింధు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె. ప్రమీల రాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. నరేందర్ రెడ్డి , ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ అరాచకాలపై ప్రశ్నిస్తే దాడులా?

## యాదగిరిగుట్ట ఘటనపై బీజేపీ ఆగ్రహం



ఇది కద నిజం: యాదగిరిగుట్టలో కాంగ్రెస్ నాయకుల తీరుపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని, సామాన్యుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. ముఖ్యంగా ఒక భూ వివాదంలో బాధితుడికి అండగా నిలిచి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బీజేపీ నాయకుడిపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి దిగడం అత్యంత హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిపై భౌతిక దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ఆగడాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే యాదగిరిగుట్ట డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకుడిపై దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కాసం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

## గృహజ్యోతి లబ్ధిదారులతో ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి




ఇది కద నిజం: పూడూరు మండలం మన్నెగూడలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్వయంగా ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గృహజ్యోతి పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 52.82 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గంలో ఈ పథకం అమలు తీరును వివరిస్తూ.. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 43,276 మందిని అర్హులుగా ఎంపిక చేశామని, ఇప్పటివరకు సుమారు రూ. 106 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ అయ్యాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ సౌకర్యం అందుతుందని, సాంకేతిక కారణాల వల్ల లేదా ఇతర ఇబ్బందుల వల్ల దరఖాస్తు చేసుకోలేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అటువంటి వారికి కూడా గృహజ్యోతి పథకం వర్తించేలా ప్రభుత్వం తరపున తగిన కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# యువతకు వివేకానందుడి బోధనలే మార్గదర్శకం

▸▸ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ఇది కద నిజం: సోమవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజ సేవను తమ జీవిత లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివేకానందుని ఆలోచనలు నేటి యువతకు దిశానిర్దేశకమని, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, యువజన సర్వీసులు క్రీడల శాఖ అధికారి రఘు, ఆర్డీఓ హరికృష్ణ, యువజన సర్వీసులు శాఖ సిబ్బంది సాగర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలింగాపురం వద్ద బోల్తా పడ్డ కాంక్రీట్ లారీ

- ప్రమాదాల అడ్డాగా శంకర్పల్లి-వికారాబాద్ రహదారి
- అధ్వానంగా రోడ్లు
- నాయకులు పట్టించుకోరు
- గుంతల రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనా?
- ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం లేదు: గ్రామస్తుల ధ్వజం




ఇది కద నిజం, మహాలింగాపురం: శంకర్పల్లి – వికారాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. తాజాగా సోమవారం నాడు మహాలింగాపురం గ్రామం వద్ద కాంక్రీట్ మిక్సర్ లారీ ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో అదృష్టవశాత్తూ ఇతర వాహనాలేవీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడగా, లారీ పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు అత్యంత అధ్వానంగా తయారవ్వడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు మండిపడుతున్నారు. రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడటంతో వాహనాలు నడపడం ప్రాణసంకటంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ఇరుగ్గా ఉండటం, ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో గుంతల్లో పడి వాహనాలు అదుపు తప్పుతున్నాయని వారు తెలిపారు. ఈ సమస్యపై ఎన్నోసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మహాలింగాపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఒక్క నాయకుడు కూడా స్పందించడం లేదు, అధికారులు మొద్దునిద్ర పోతున్నారు” అని వారు వాపోయారు. ప్రాణాలు పోకముందే ప్రభుత్వం స్పందించి, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

# డీఏ ప్రకటన కంటితుడుపు చర్యే

## తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్



ఇది కద నిజం: ఉద్యోగులకు ప్రభుత్వం డీఏ కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరభద్రరావు మండిపడ్డారు. సోమవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో టీజేటీఎఫ్ కోశాధికారి ఘనపురం దేవేందర్, రాష్ట్ర నాయకులు ఎస్ కే మస్తాన్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2023 జులైలో ఇవ్వాల్సిన డీఏ ను ఇప్పుడు ప్రకటించి ఉద్యోగులకు ఏదో చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన డీఏలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఉద్యోగులకు డీఏ ఇవ్వడం వారి హక్కు మాత్రమే తప్ప ఎలాంటి అదనపు ప్రయోజనం కాదు అన్న విషయం గుర్తించాలన్నారు. ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా పై స్పష్టత ఇవ్వాలని, ప్రీమియం ఎవరు చెల్లిస్తారనే విషయం పై క్లారిటీ ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకుండా, పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వడం లాంటి కీలక సమస్యలను పక్కన పెట్టి ఒక్క డీఏతో సరిపెట్టడం తగదన్నారు. వెంటనే ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు .

# వాషింగ్టన్ సుందర్‌కు గాయం.. బీసీసీఐ సెలెక్షన్ కమిటీ కీలక నిర్ణయం

స్పోర్ట్స్ న్యూస్, 12 జనవరి (ఇది కద నిజం: ): న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా మిగిలిన రెండు వన్డేలకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ సెలక్షన్ కమిటీ కీలక నిర్ణయం తీసుకున్నది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోని ని జట్టులోకి తీసుకుంటున్నట్లుగా అధికారికి ప్రకటన విడుదలైంది. ఇక ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున, అలాగే దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ జట్టు తరపున బదోని నిలకడగా రాణిస్తున్నాడు. ముఖ్యంగా బెస్ట్ ఫినిషర్‌గా, ఆఫ్ స్పిన్నర్‌గా రెండో వన్డే నాటికి బదోని జట్టుతో చేరనున్నాడు.కాగా, వడోదరలో జరిగిన మొదటి వన్డేలో బౌలింగ్ చేస్తున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ తన ఎడమ వైపు కింది పక్కటెముకల భాగంలో తీవ్రమైన అసౌకర్యానికి గురయ్యాడు. ఆ మ్యాచ్‌లో కేవలం 5 ఓవర్లు మాత్రమే వేసిన సుందర్, ఆ తర్వాత మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అయితే, బ్యాటింగ్‌లో మాత్రం ఇబ్బంది పడుతూనే జట్టు విజయం కోసం క్రీజులోకి వచ్చాడు. ప్రస్తుతం అతని గాయానికి సంబంధించి స్కానింగ్ నిర్వహించనున్నట్లు, వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నట్లు బోర్డు తెలిపింది.



# తాండూరులో ఘనంగా స్వామి వివేకానంద జయంతి

□ నివాళులర్పించిన బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్



ఇది కద నిజం, తాండూరు: తాండూరు పట్టణంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని శాంత్ మహల్ చౌరస్తా సమీపంలో ఉన్న వివేకానంద విగ్రహానికి బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శుభప్రద్ పటేల్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా “లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి” అనే మంత్రాన్ని నేటి యువత తమ జీవిత ఆశయంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. “బలమే జీవితం – బలహీనతే మరణం” అని స్వామి వారు బోధించారని, కాబట్టి యువత పిరికితనాన్ని వదిలి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని హితబోధ చేశారు. “ఒక ఆలోచనను తీసుకోండి.. ఆ ఆలోచననే మీ జీవితంగా చేసుకోండి” అన్న వివేకానందుడి మాటల స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో కీలక భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో భాగంగా కేవీసీఎస్ (KVCS) పాఠశాల విద్యార్థులు స్వామి వివేకానంద వేషాధారణలో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు వివేకానందుడి గెటప్‌లో ఆనాటి స్ఫూర్తిని రగిలిస్తూ ప్రదర్శనలు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.